క్లుప్తంగా

సమస్యలను పరిష్కరించాలని వినతి



ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) రాష్ట్రాధ్యక్షుడు ఎం అశోక్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వీ శంకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆత్మకూరు ఆర్డీఓ బీ పావనిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆర్డీఓ వసతిగృహాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థి నాయకులు వినయ్, కళ్యాణ్, చందు, ప్రశాంత్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశిబిరం



సోమశిల(ఆత్మకూరు): అనంతసాగరం మండలం చిలకలమర్రిలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. పాడి పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. జిల్లా సెమన్ బ్యాంకు డీడీ శ్రీనివాసులు, మర్రిపాడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎస్ గురుజయంతి పాడి పశువుల పెంపకంలో పాటించాల్సిన మెలకువలు, కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి పశువులను పొందడంపై అవగాహన కల్పించారు. రేవూరు పశువైద్యశాల డాక్టర్ ప్రసాద్, అసిస్టెంట్ సుబ్బరాయుడు, స్థానిక నాయకులు మునగపాటి సునీత, తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

సంగం: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపును బుధవారం చేపట్టారు. 49 రోజులకు సంబంధించి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.83,170 ఆదాయం వచ్చిందని ఆలయ ఇన్‌స్పెక్టర్ చైతన్య తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పది మద్యం సీసాలు స్వాధీనం

కావలి: పట్టణంలోని బాలకృష్ణారెడ్డినగర్‌లో కట్ట పద్మ అనే మహిళ పది క్వార్టర్ మద్యం సీసాలను అక్రమంగా కలిగి ఉండగా బుధవారం స్వాధీనం చేసుకున్నట్లు కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. మహిళపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో ఎస్సై ఎం దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులందరికీ ఓటు కల్పించాలి

ఉదయగిరి: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అర్హులైన రైతులందరికీ ఓటు హక్కు కల్పించాలని రైతు సంఘ నాయకుడు కాకు వెంకటయ్య కోరారు. ఈ మేరకు ఇరిగేషన్ డీఈ చంద్రమౌళికి బుధవారం వినతిపత్రం అందజేశారు. బండగానిపల్లి పంచాయతీలోని లింగాలచెరువు ఆయకట్టు పరిధిలో భూములు కలిగిన రైతుల పేర్లు ఓటరు జాబితాలో లేవన్నారు. గ్రామసభ నిర్వహించకుండా, రైతులకు సమాచారం ఇవ్వకుండానే ఓటరు జాబితాను ప్రకటించారని తెలిపారు. అందులో గ్రామంలో లేని, చనిపోయిన వారి పేర్లు అధికంగా ఉన్నాయన్నారు. భూములు సాగుచేస్తున్న రైతుల పేర్లను ఓటరు జాబితాలో చేర్చాలని కోరారు.

అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని వినతి



అనుమసముద్రంపేట: విద్యాశాఖ అధికారుల అసంబద్ధ నిర్ణయాలను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల పనివేళల పెంపు, 10వ తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్, అపార్ నమోదు, 10 శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదు, తదితర నిర్ణయాలు అసంబద్ధంగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళన, మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న అసంబద్ధ నిర్ణయాలను విద్యాశాఖ అధికారులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



పాఠశాలకు బురదలో నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు



బురదను దాటేందుకు ఫీట్లు చేస్తున్న విద్యార్థులు

బడికెళ్లాలంటే అడుసు తొక్కాల్సిందే

- వర్షాలకు రొచ్చురొచ్చుగా మారిన రోడ్డు
- కదిరినేనిపల్లె పాఠశాల విద్యార్థులకు తప్పని ఫీట్లు

మర్రిపాడు: మండలంలోని కదిరినేనిపల్లె ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. వర్షం పడితే రొచ్చురొచ్చుగా మారుతోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు విద్యార్థులు ఫీట్లు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పనుల్లో భాగంగా కదిరినేనిపల్లె ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు. దీంతో ప్రస్తుతం పాఠశాలలో 20 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. అయితే పాఠశాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. దీనికి తోడు గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో చిన్నారులు స్కూల్‌కు వెళ్లి రావాలంటే పెద్ద సాహసమే చేయాల్సి వస్తోంది. బురదలో నడిచి వెళ్లే క్రమంలో ఎక్కడ జారి పడిపోతామోనని ఒకరిని ఒకరు పట్టుకుని వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. బురదలో దిగి వచ్చే క్రమంలో దుస్తులు పాడైపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. రోడ్డు సమస్యను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. మండలాధికారులకు సైతం విన్నవించారు. అయిన్పటికీ రోడ్డు సమస్యను పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ ఆనంద్ స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

రేషన్ కార్డుల మంజూరుకు వినతి

జలదంకి: వేములపాడుకు చెందిన గిరిజన కుటుంబాలకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలని రాష్ట్ర యానాది సంఘాల మహాకూటమి ఉపాధ్యక్షుడు జయంపు కనకయ్య కోరారు. ఈ మేరకు వేములపాడుకు చెందిన గిరిజన కుటుంబాలతో కలిసి జలదంకి డిప్యూటీ తహసీల్దార్ జాలీభాయ్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యుడు మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యాన శాఖ పథకాలపై అవగాహన

కావలి: ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా కల్పిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కావలి ఉద్యాన శాఖ అధికారిణి సుధామయి కోరారు. మండలంలోని తుమలపెంట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పండ్ల తోటల పెంపకం, ప్యాక్‌హౌస్, షేడ్‌నెట్ కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజీలు, పందిరి తోటలు, తదితరాలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పించారు. మైక్రో ఇరిగేషన్ కింద డ్రిప్, స్ప్రింక్లర్లను అందజేస్తోందని వివరించారు. కావలి ఏవో లలిత, ఏఎంసీ అధికారుల, వీఏఏలు కావ్య, భువన పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



ఆత్మకూరులో దివ్యాంగులకు సత్కారం



అల్లూరులో వీల్‌చైర్ల పంపిణీ

అల్లూరు: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఈఓ–1,2 రవీంద్రనాథ్, సునీత పిలుపునిచ్చారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. దివ్యాంగులపై సానుభూతి చూపకుండా ప్రతి ఒక్కరూ వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం దివ్యాంగులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన ఉపకరణాలను పంపిణీ చేశారు. కేఎస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కందల రాజారెడ్డి ఆదేశాల మేరకు ఫౌండేషన్ సభ్యులు అన్నదానం చేశారు. భవిత స్కూల్ ఉపాధ్యాయులు జే సునీత, సీ శిల్ప, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని మెప్మా కార్యాలయంలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులను చిన్నచూపు చూడరాదని, వారిలోనూ విశేష ప్రతిభ ఉంటుందని పలువురు రుజువు చేశారన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం దివ్యాంగులను శాలువాలతో సన్మానించారు. మెప్మా టీఎంసీ మాధవి, ఆర్పీలు, పొదుపు సభ్యులు పాల్గొన్నారు.

నర్సరీలకు అనుమతులు తప్పనిసరి



వింజమూరులో నర్సరీని తనిఖీ చేస్తున్న ఉద్యాన అధికారి షమీల్

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు, కలిగిరి మండలాల్లోని నర్సరీల నిర్వాహకులు నిబంధనల మేరకు అనుమతులు తీసుకుని రిజిష్టర్ చేయించుకోవాలని వింజమూరు ఉద్యానశాఖ అధికారి షేక్ షమీల్ సూచించారు. వింజమూరులో లైసెన్స్‌లు లేకుండా నిర్వహిస్తున్న నర్సరీల నిర్వాహకులకు బుధవారం ఆయన నోటీసులు జారీ చేశారు. నాలుగు రోజుల్లోగా లైసెన్స్‌లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ నర్సరీ చట్టం–2010పై నర్సరీల నిర్వాహకులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొక్కలు విక్రయించేటప్పుడు అన్ని వివరాలతో కూడిన బిల్లులను ఇవ్వాలన్నారు. నర్సరీల్లో నకిలీ మొక్కల విక్రయాలు జరిగినప్పుడు రైతులకు బిల్లులు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. నర్సరీ నిర్వాహకులు నిబంధనలు పూర్తిస్థాయిలో పాటించి మొక్కల విక్రయాలు జరపాలన్నారు. అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గిరిజనులకు గృహ నిర్మాణాలపై అవగాహన



ఆత్మకూరురూరల్: ప్రభుత్వం పీఎంఏవై పథకం కింద గృహ నిర్మాణాలను మంజూరు చేస్తోందని, వాటిని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సూచించారు. మండలంలోని దేపూరులో బుధవారం ఆయన పర్యటించారు. గిరిజన కాలనీలో గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కాచిచల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఆయన వెంట గృహ నిర్మాణ శాఖ ఏఈ శరత్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పోలీసులకు ప్రశంసాపత్రాలు





ఎస్పీ నుంచి పశంసాపత్రాలు అందుకున్న సీఐ గంగాధర్, ఎస్సై షేక్ జిలానీ

ఆత్మకూరు: ఆత్మకూరు సీఐ జీ గంగాధర్, ఆత్మకూరు, మర్రిపాడు ఎస్సైలు ఎస్‌కే జిలానీ, శ్రీనివాసులు ఎస్పీ కృష్ణకాంత్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఇటీవల ఆత్మకూరు సర్కిల్ పరిధిలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి రూ.8 లక్షలు నగదుతో పాటు మూడు కార్లు, 15 మంది జూదరులను అదుపులోకి తీసుకోవడంపై నెల్లూరులో బుధవారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో సీఐ, ఎస్సైలను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

మునిగిన నారుమళ్లు



మునిగిన నారుమడులను చూపుతున్న రైతులు

అనుమసముద్రంపేట: చిరమన చెరువు ఆయకట్టు పరిధిలోని దాదాపు 50 ఎకరాలకు సరిపడా నారుమడులు నీట మునిగాయి. మంగళవారం కురిసిన భారీ వర్షానికి చెరువు సమీపంలోని సన్నవాగు పొంగడంతో వారం రోజుల క్రితం పోసిన నారుమడులు పూర్తిగా మునిగిపోయాయి. ఇటీవల చెరువు సమీపంలోని పొలాలకు చెందిన రైతులు ఎల్లవ కాలువను పూడ్చివేసి ఆక్రమించుకున్నారు ఈ విషయమై అప్పట్లోనే తహసీల్దారుకు సైతం రైతులు ఫిర్యాదు చేశారు. అయితే భారీ వర్షం కురవడం వల్ల వర్షపు నీరు సన్న వాగులోకి చేరి పొలాలపై పడి నారుమడులు మునిగిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయాన్ని రైతులు వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బుధవారం పొలాల వద్దకు చేరుకుని పరిశీలించారు. నారుమడులు నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీపై తిరిగి విత్తనాలను అందజేస్తామని వీఆర్వో కృష్ణయ్య, వీపీఏ సంధ్యారాణి తెలిపారు. కాగా ముంపు సమస్యపై తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు రైతులు తెలిపారు.

నేటి నుంచి జీవాలకు టీకాలు

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు పశువైద్యశాలల పరిధిలోని జీవాలకు పారుడు వ్యాధి నివారణకు గురువారం నుంచి టీకాలు వేయనున్నట్లు ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో సుమారు 75వేల వరకు మేకలు, గొర్రెలు ఉన్నాయని తెలిపారు. జీవాల పెంపకందారులు పశువైద్య సిబ్బందిని సంప్రదించి టీకాలు వేయించుకోవాలని సూచించారు.

ఆత్మకూరులో 76.2 మి.మీ. వర్షపాతం

ఆత్మకూరు: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో బుధవారం అత్యధికంగా ఆత్మకూరులో 76.2 మి.మీ.వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. సీతారామపురం 30.2, ఉదయగిరి 11.6, ఏఎస్‌పేట 40.4, చేజర్ల 22.2, కలువాయి 1.8, సంగం 26, మర్రిపాడు 10 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

గండిపాళెంలో 15.5 అడుగుల నీటి మట్టం

ఉదయగిరి: గండిపాళెం ప్రాజెక్ట్‌లో బుధవారం సాయంత్రానికి 15.5 అడుగుల మేర నీటి మట్టం చేరినట్లు ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్ట్‌కు ఎగువ ప్రాంతం నుంచి 380 క్యూసెక్కుల వరద వస్తోందని తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 35 అడుగులని చెప్పారు. ఈ నెల రెండో వారంలో మరో వాయుగుండం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో ఈ ఏడాది ప్రాజెక్ట్‌లో పూర్తిస్థాయిలో నీరు చేరే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉదయగిరి సబ్‌డివిజన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి మండలాల్లోని చెరువుల్లోనూ సాగునీరు ఆశాజనకంగా చేరిందన్నారు. కాగా ఈ నెల 8న జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసిందని తెలిపారు.

రక్తదాన శిబిరం



బ్రాహ్మణక్రాకలో రక్తదానం చేస్తున్న వంటేరు

జలదంకి: కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కావలి రెడ్‌క్రాస్ సహకారంతో బ్రాహ్మణక్రాకలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వంటేరుతో పాటు పలువురు యువత స్వచ్ఛందంగా రక్తం చేశారు. అలాగే నెల్లూరు నారాయణ ఆస్పత్రి సహకారంతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే బ్రాహ్మణక్రాక ఉన్నత పాఠశాలలోని 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులను వితరణ చేశారు.

క్రీడాకారులకు అభినందన



ఉదయగిరి: ఇటీవల తిరుపతి, బాపట్లలో జరిగిన అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక, వ్యాసరచన పోటీల్లో ఉదయగిరి మేకపాటి గౌతమ్‌రెడ్డి కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి బుధవారం అభినందించారు. అధ్యాపకులు గోపీకృష్ణ, సునీత, జీ రమేష్, దుర్గాప్రసాద్, కిషన్‌తేజ, పీడీ రమణ, కమలప్రియ, శోభ, మాధవి, రాజేశ్వరి, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోగా గృహ నిర్మాణాలను పూర్తిచేయాలి



నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఈ దయాకర్

ఉదయగిరి: పక్కాగృహ నిర్మాణాలను మార్చిలోగా పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ దయాకర్ అన్నారు. కొండాయపాళెం పంచాయతీ పరిధిలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రభుత్వ లేఅవుట్‌లో గృహ నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల్లూరు, ఆత్మకూరు డివిజన్‌ల పరిధిలోని 22 మండలాల్లో 39,045 గృహ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. గృహ లబ్ధిదారులు మార్చిలోగా నిర్మాణాలను పూర్తిచేసుకోకుంటే రద్దు అయిపోతాయని తెలిపారు., బిల్లులు వచ్చే అవకాశం ఉండదన్నారు. కొత్తగా పక్కాగృహాలు నిర్మించుకోవాలనుకునే వారు ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదుచేసుకుంటే వచ్చే జనవరిలో మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. ఏఈ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

హిందువులపై నరమేధాన్ని ఆపాలి



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ చైతన్య వేదిక సభ్యులు

వింజమూరు(ఉదయగిరి): బంగ్లాదేశ్‌లో హిందువులపై సాగిస్తున్న నరమేధాన్ని నిరసిస్తూ హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో వింజమూరులోని శివాలయం నుంచి బంగ్లాసెంటర్ వరకు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ చైతన్య వేదిక జిల్లా ప్రతినిధి వీర సావార్కర్ మాట్లాడుత బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా అధికారం కోల్పోయిన నాటి నుంచి హిందువులపై సాగుతున్న నరమేధంతో ఎంతో మంది మైనార్టీ హిందువులు ఆస్తులు, ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు బంగ్లాదేశ్‌పై ఒత్తిడి తీసుకొచ్చి నరమేధాన్ని ఆపాలని కోరారు. హిందూ స్త్రీలపై జరుగుతున్న లైంగికదాడులు, హిందూ ఆలయాల ధ్వంసం, హిందూ ఉద్యోగులతో బలవంతంగా రాజీనామాలు చేయించడం, ఇస్కాన్ గురువు ఇన్మయ కృష్ణస్వామిని అరెస్ట్ చేయడం, బెయిల్ కోసం ప్రయత్నిస్తున్న న్యాయవాదులను హత్య చేయడం వంటి అరాచక చర్యలను ఆపాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రతినిధులు కందల మధు, బ్రహ్మయ్య, ఆర్వీ కృష్ణారెడ్డి, వై రఘురామిరెడ్డి, ఎం తిరుపాల్‌రెడ్డి, కర్రా భాస్కర్, రమేష్, రవీంద్ర, పీ ప్రకాష్, వెంగళరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలను నేస్తాలుగా మార్చుకోవాలి

కావలి: పదోతరగతి విద్యార్థులు పుస్తకాలను నేస్తాలుగా మార్చుకోవాలని ఎంఈఓ–1 బండి గోవిందయ్య సూచించారు. పట్టణంలోని వెంగళరావునగర్‌లోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులకు ప్రకాష్ రాష్ట్రీయ సర్వేక్షణ్–2024 నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో భాగంగా బుధవారం నిర్వహించిన పరీక్షలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. కష్టపడి చదివి మంచి ఫలితాలను సాధించాలన్నారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. హెచ్ఎం సయ్యద్ హయ్యాల్ హయ్యూమ్, ఐ శ్రీనివాసులు బీ శాంతకుమారి సీఆర్పీ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి



జలదంకి: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శైలజ

జలదంకి: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ బీ శైలజ కోరారు. జలదంకి రైతుసేవా కేంద్రంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రబీ సాగుపై సూచనలు చేశారు. రబీ సీజన్‌లో సాగుచేస్తున్న వరి, పచ్చిశనగ, మినుము పంటలకు పంటల బీమా వర్తిస్తుందన్నారు. ఎకరాకు వరికి రూ.168, పచ్చిశనగకు రూ. 56, మినుముకు రూ.38 చొప్పున రైతులు కామన్ సర్వీస్ సెంటర్లలో చలానా చెల్లించి బీమాకు నమోదు చేసుకోవాలని సూచించారు. వరి పంటకు ఈ నెలాఖరు వరకు వరకు, మినుము, శనగ పంటలకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందన్నారు. పంట బీమా చేసుకుంటే ప్రకృతి విపత్తులతో పంట నష్టపోతే పరిహారం అందుతుందని తెలిపారు.

వరికుంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో సాగుచేసిన పంటలను మండల వ్యవసాయాధికారి వీ రవికుమార్ పరిశీలించారు. రైతులకు ఈక్రాప్ నమోదు, పంట బీమా పథకంపై అవగాహన కల్పించారు.

చేజర్ల: మండలంలోని పాడేరు, పాతపాడు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏఓ శశిధర్ పాల్గొన్నారు. రైతులకు పంట బీమా పథకంపై అవగాహన కల్పించారు.

వర్షాలొస్తే పట్టలు కప్పాల్సిందే



కావలి: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరి వర్షం పడితే ఉరుస్తోంది. బ్రిటీష్ కాలం నాటి కట్టడం కావడంతో పైకప్పు పూర్తిగా దెబ్బతింది. ప్రభుత్వం మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షం పడితే కంప్యూటర్లు, రికార్డులు తడిసి ముద్దవుతున్నాయి. దీంతో తహసీల్దార్ రికార్డులను కాపాడుకుంటే చాలు తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించినట్లేనని భావించి ప్లాస్టిక్ పట్టలు కప్పించారు.

డీఎస్పీకి వినతి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలంలోని దేవాలయాల్లో తరచూ జరుగుతున్న దొంగతనాలను కట్టడి చేసి తగిన భద్రత కల్పించాలని ఆత్మకూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి కోరారు. ఈ మేరకు ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్, సీఐ గంగాధర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు.

సంగంలో భారీ వర్షం



సంగం: మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమమై స్థానికులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షానికి జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

ఆత్మకూరురూరల్/సీతారామపురం/వరికుంటపాడు/చేజర్ల: ఆత్మకూరు, సీతారామపురం, వరికుంటపాడు, చేజర్ల మండలాల్లో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఆయా మండలాల తహసీల్దార్లు సుధీర్, పీవీకృష్ణారెడ్డి, పీ హేమంత్‌కుమార్, మురళి బుధవారం తెలిపారు. భూసమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు చెప్పారు.